
పిల్లల బొమ్మల

# మర్యాద రామన్న కథలు



పిల్లల బొమ్మల

# మర్యాద రామన్న కథలు



సంపాదకుడు

రెడ్డి రాఘవయ్య

స్వాతి బుక్ హౌస్

# మర్యాద రామన్న కథలు

Retold by:
**Premchand**

ISBN - 978-93-84812-10-2

Illustrations by:
**PAANI,** Chennai

Computer design & layout:
**Giridhar**

© **Swathi Book House**

28-22-20, Rahiman Street,

Arundalpet,

Vijayawada-520 002 (A.P.)

Ph.: 0866-2432813, 98480 82432

Price:

Rs. **100/-**

Printing:

**ARUNODAYA**

Vijayawada-520 002

**విషయసూచిక**

| | | |
|---|---|---|
| **1.** | రామన్న తీర్పు | **3** |
| **2.** | పోయిన వస్తువు | **12** |
| **3.** | బంగారు చెవి పోగులు కథ | **20** |
| **4.** | వజ్రం కోసం తగాదా | **28** |



# రామన్న తీర్పు

గ్రామంలో అందరూ రామన్నను పనికిరాని వెర్రిబాగులవాడుగా పరిగణిస్తారు. వాస్తవానికి రామన్న కాళికాదేవి వరము పొందినవాడు ! ఒకసారి ఒక గొప్ప పండితుణ్ని రామన్న తన తెలివితేటలతో, పరిజ్ఞానంతో వోడించటంతో అందరూ ఆశ్చర్యచకితులయ్యారు. తన గ్రామంలోని ప్రజలంతా రామన్నను పొగడ్తలతో ముంచెత్తారు. రామన్న తండ్రి సుబ్బన్న కొడుకు తెలివి తేటలకు సంతోషించాడు. తన కొడుకు అంతటి పండితుడు కాగలడని సుబ్బన్న కలలోకూడా వూహించలేదు. రామన్న తల్లి ముత్యాలమ్మకూడా తన కొడుకు గొప్ప పండితుడయ్యాడని అమితానందం పొందింది. అందుకు కారణం శ్రీరాముడి ఆశీర్వాదబలమని ఆమె నమ్మింది. ఏమయినప్పటికీ, ఆ సంఘటనతో రామన్న పేరు ప్రతిష్టలు ఆ చుట్టు ప్రక్కల గ్రామాలన్నింటికి విస్తరించింది. ఆయా గ్రామస్థులు తమలో తమకు గొడవలు, స్పర్ధలు వచ్చినప్పుడు రామన్న దగ్గరకు వచ్చి వాటిని పరిష్కరించుకుంటున్నారు. రామన్న ఇస్తున్న తీర్పులు అందర్నీ



ఆశ్చర్యపరుస్తున్నాయి. ప్రతి వొక్కరు వాటిని ఆమోదిస్తున్నారు. రామన్న తన తీర్పులో ఎప్పుడూ పొరపాటు చేయటం జరగలేదు.


ఒకసారి రామన్న రాజుగారు వుంటున్న పట్టణం వెళ్ళాడు. ఆ పట్టణంలో అపరిచిత వ్యక్తులనందరిని ఆశ్చర్యంగా పరిశీలిస్తూ వున్నాడు. ఒకచోట నలుగురు వ్యక్తులు కలిసి ఒక పూటకూళ్లమ్మ ఇంట్లోకి ప్రవేశించటం రామన్న చూశాడు. రామన్న చూస్తూ వుండగానే ఆ నలుగురూ ఆ పూటకూళ్ళమ్మ యజమానురాలితో "అమ్మా ! రెండు మూడు రోజులు మేము ఇక్కడే వుంటాం. దయచేసి ఈ పెట్లెను మీ దగ్గర వుంచండి. మేమందరం కలసి వచ్చినప్పుడు మాత్రమే ఈ సంచిని మాకు తిరిగి ఇవ్వండి. మాలో ఏ ఒక్కరు వచ్చినా ఈ పెట్టెను ఇవ్వద్దు'' అన్నారు. వాళ్ళా పెట్టను ఆమెకు ఇచ్చి వెళ్ళిపోయారు. కొద్ది సమయం తరువాత వారు నలుగురూ తిరిగి పూటకూళ్లమ్మ దగ్గరకు వచ్చారు. వాళ్ళలో వాళ్ళు కొంతసేపు పూటకూళ్లమ్మ బయట కూర్చుని చర్చించుకుని తమలో ఒక వ్యక్తిని పూటకూళ్లమ్మ దగ్గరకు వెళ్ళి 'డబ్బు పెట్టె తీసుకురమ్మని పంపారు. వాళ్ళు నలుగురూ దొంగలని వారు యిచ్చిన సంచి వారు దొంగిలించిన ధనమనీ గ్రహించింది ములసమ్మ.



అతడు ముసలమ్మ దగ్గరకు వెళ్ళి విషయం చెప్పాడు.

ఆ మాటలకు ముసలమ్మ అతడి వైపు ఆశ్చర్యంగా చూసింది. "అందరు కలిసి వచ్చి తీసుకెళతామని చెప్పారు కదా! ఇప్పుడు నువ్వు ఒక్కడివే వచ్చి అడుగుతున్నావు. నేను ఇవ్వను. మీరు అందరూ కలసి వస్తేనే మీసంచిని ఇస్తాను." అని ముసలమ్మ చెప్పింది.

అందుకు అతడు "నా మిత్రులందరూ బయట వున్నారు. వాళ్ళే సంచి తీసుకురమ్మని నన్ను పంపారు. నా మాటలపైన నమ్మకం లేనట్లయితే నువ్వే బయటకు వచ్చి చూడు" అన్నాడు. ఆమె బయటకు వచ్చి మిగతా వ్యక్తులను చూసి 'ఆ సంచి ఇవ్వమంటారా' అని అడిగింది. అందుకు వాళ్ళందరూ తలలు వూపారు. దాంతో ఆమె లోపలికి వచ్చి ఆ వ్యక్తికి సంచి అందజేసింది. అయితే సంచి తీసుకున్న వ్యక్తి వెనుక తలుపుగుండా సంచితో సహా పారిపోయాడు. చాలా సేపు ఎదురుచూసి తమ మిత్రుడు ఎంతకీ రాకపోవటంతో వాళ్ళే పూటకూళ్లమ్మ లోపలికి వెళ్ళారు. అయితే అక్కడ తమ మిత్రుడు కనపడకపోవటంతో ముసలమ్మని తమ డబ్బు సంచి ఇమ్మని అడిగారు.



ఆమె మీరు చెప్పినట్లుగా మీరు పంపిన వ్యక్తికి ఆసంచిని ఇచ్చానని చెప్పింది. ముసలమ్మ చెప్పిన సమాధానంతో వాళ్ళకు విపరీతమైన కోపం వచ్చింది. వాళ్ళు ఆమెను తిట్టటం మొదలుపెట్టారు. ముసలమ్మ మాత్రం మౌనంగా వుండిపోయింది. చివరికి వాళ్ళు, "నువ్వు చెప్పే మాటలన్నీ మాకనవసరం. మేం నీతో స్పష్టంగా చెప్పాం. మేం నలుగురం కలసి వచ్చినప్పుడు మాత్రమే మా సంచి తిరిగి ఇమ్మన్నాం. అలా కాకుండా మాలో ఒకరికి నువ్వు ఆ సంచి ఇచ్చావు. కాబట్టి తప్పు నీదే. ఆ సంచిలో చాల రూపాయలు వున్నాయి. మా డబ్బు మాకు నువ్వే ఇవ్వాలి. అలా కాకపోతే మేం అధికారులకు ఫిర్యాదు చేస్తాం" అని గద్దించారు.


అందుకు ఆ ముసలమ్మ "నాకేమీ తెలియదు. ఆ సంచి అతనికి ఇవ్వబోయే ముందే మీకు చెప్పాను. మీ అనుమతి తీసుకుని మాత్రమే మీలో ఒకడయిన ఆవ్యక్తికి నేను సంచి ఇవ్వటం జరిగింది. నేనసలే పేదదాన్ని. దయచేసి నా పరిస్థితి అర్థం చేసుకోండని" అర్థించింది.



వారు ఆమె మాటలు పట్టించుకోలేదు. తమ డబ్బు తమకు తిరిగి ఇవ్వమని వొత్తిడి చేయటం మొదలు పెట్టారు.

ఆమెను రెక్క పట్టుకుని బలవంతంగా వీధిలోకి లాగి న్యాయస్థానానికి రమ్మని బలవంతం చేశారు. ఆమెను న్యాయమూర్తి ముందుకు తీసుకువెళ్ళారు.

న్యాయమూర్తి ఇరువర్గాలు చెప్పిన విషయాలు విని తీర్పు చెప్పాడు. "ఈ ముసలామె రెండు వేల రూపాయలూ, సంచీ తన దగ్గర దాచుకున్న వ్యక్తులకు చెల్లించాలి" అని ఆదేశించాడు. తన తప్పేమీ లేకపోయినా రెండు వేల రూపాయలు చెల్లించమని ఆదేశించిన న్యాయమూర్తి మీద ముసలమ్మకు విపరీతమయిన కోపమొచ్చింది. తను ఎక్కడ నుంచి తెచ్చి అంత డబ్బు కట్టగలదు ? "తప్పుడు తీర్పు చెప్పిన ఈ న్యాయమూర్తి నాశనమయిపోతాడు" అని తిట్టింది ముసలమ్మ. ఆ సందర్భంలో ఇదంతా గమనిస్తూ వున్న రామన్న ఆమె దగ్గరకు చేరి యిలా అన్నాడు. "ఈ రాజు త్వరలో తన అధికారాన్ని కోల్పోబోతున్నాడు. ఇతనికి ప్రజల సమస్యలు ఏమాత్రం అవగతం కావటం లేదు. వొట్టి



మూర్ఖుడులాగా వున్నాడు. ప్రజలందరికీ న్యాయం అందుబాటులో వుండేటట్టు చూడటంలో ఈ రాజు పూర్తిగా విఫలమయ్యాడు''.

రామన్న అలా రాజుని నిందిస్తూ వుండటం ఆ మార్గంలో వెళుతున్న రాజుగారి సైనికులు విన్నారు. రామన్నను పట్టుకొని రాజుగారి దగ్గరకు తీసుకెళ్ళారు. "మహారాజా ! ఈ వ్యక్తి మిమ్మలను దూషిస్తూ వుండగా విని తీసుకొచ్చాం'' అని రాజుగారితో చెప్పారు. "సరే ! అతన్ని ఇక్కడ వదిలి వెళ్ళండి. నేను తెలుసుకుంటాను'' అన్నాడు రాజు. ఆ తరువాత రాజు కొంతసేపు రామన్నను తీక్షణంగా పరిశీలించి చూసి, "నువ్వెవరు ? ఏ ప్రాంతం నుంచి వచ్చావు ?'' అని అడిగాడు. "మహారాజా ! నేను ఇక్కడకు కేవలం అయిదు మైళ్ళ దూరంలో వున్న ఒక చిన్న పల్లెటూరిలో వుంటాను. నా పేరు రామన్న. అందరూ నన్ను 'మర్యాద రామన్న' అంటారు''.

"మర్యాద రామన్న అంటే నువ్వేనా ? ఇంతకీ నేను చేసిన తప్పేమిటి ? నువ్వు నన్ను నిందించావట. కారణమేమిటి ?'' అని అడిగాడు రాజు.



“మహారాజా ! ఒక న్యాయమూర్తి తప్పు చేస్తే ఆ తప్పు పరిపాలించే రాజుకే చెందుతుంది. అలాగే ప్రజలు చేసే తప్పులకు కూడా రాజే బాధ్యులు”, అన్నాడు రామన్న. రాజు నవ్వి “నువ్వు సరిగానే చెప్పావు. మా న్యాయమూర్తి చేసిన తప్పేమిటో చెప్పు, దాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తాను” అని అన్నాడు రాజు చిరునవ్వుతో.


“మహారాజా ! దయచేసి జరిగిన సంఘటనకు సంబంధించి మరోసారి విచారణ జరిపించండి. మీ న్యాయమూర్తి ఆ ముసలమ్మకు అన్యాయం చేశాడు. పది మంది నేరస్తులు తప్పించుకు పోయినా పరవాలేదు. ఒక అమాయకుడికి కూడా శిక్షపడకూడదని కదా ! పెద్దలంటారు”. రామన్న మాటలకు రాజు ఆనందించాడు. రామన్న తెలివయినవాడని నిర్ధారించుకోవటంతో పాటు అతని ధైర్యం చూసి రాజు ముగ్ధుడయ్యాడు.

“రామన్నా! నేను ఇంతకు ముందే నీ గురించి విని వున్నాను. ఈ తగాదాకు సంబంధించి నువ్వయితే ఎలాంటి తీర్పు ఇస్తావో చూడాలనుకుంటున్నాను ?” అని రామన్నను అడిగాడు.



"మీరు అనుమతిస్తే తప్పకుండా చెపుతాను మహారాజా !" అని అన్నాడు రామన్న. రాజు తన ప్రక్క ఆసనాన్ని చూపించి రామన్నను దానిపై కూర్చోమని చెప్పాడు. రామన్న ముసలమ్మతో పాటు, ఆ ముగ్గురు దొంగల్ని కూడా పిలిపించాడు. రామన్న తీర్పు వినాలని అనేక మంది జనం కూడా అక్కడకు చేరుకున్నారు. రామన్న ఇరువర్గాల వాదనలు సావధానంగా విన్నాడు. ఆ తరువాత కొంతసేపు దీర్ఘంగా ఆలోచించాడు. ప్రజలందరు రామన్న తీర్పు కోసం వుత్కంఠభరితంగా ఎదురు చూస్తూ వున్నారు. అప్పుడు రామన్న దొంగల వైపు తిరిగి,

"మీరు చెప్పినట్టుగా ముసలమ్మ దగ్గర మీరు డబ్బుదాచిన మాట నిజం. ఆ విషయం ముసలమ్మ కూడా అంగీకరిస్తోంది. ఆ విషయంలో ఎటువంటి గందరగోళమూ లేదు. ఇక రెండవ విషయానికి వద్దాం. మీరు పెట్టిన షరతుల ప్రకారం మీరు నలుగురూ తిరిగివచ్చి అడిగినపుడు మాత్రమే మీకు ముసలమ్మ ఆ సంచిని ఇవ్వాలి. మరి ఇప్పుడు మీరు ముగ్గురు మాత్రమే వున్నారు. అందువల్ల మీరు ఆ డబ్బు సంచిని అడగటం సరి కాదు. మీరు



నలుగురూ కలిసి వచ్చినప్పుడు మాత్రమే ఆ సంచిని ఇవ్వటం జరుగుతుంది. అందువల్ల వెళ్ళి వెంటనే మీ మిత్రుడ్ని తీసుకువచ్చి డబ్బు సంచి తీసుకువెళ్ళండి" అని అన్నాడు రామన్న. రామన్న మాటలు విన్న ప్రజలు అతని తెలివికి ముగ్ధులయి చప్పట్లు కొట్టారు. రామన్న ఇచ్చిన తీర్పు రాజును ఆశ్చర్యపర్చింది. రాజు సంతోషించి, "ఇందుకే ప్రజలు నిన్ను 'మర్యాద రామన్న' అంటున్నది" అని అన్నాడు. రాజు రామన్నను ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు. ముసలమ్మ ఆనందంతో రామన్నను దీవించింది.


ఆ తర్వాత రాజు రామన్ననుద్దేశించి యిలా అన్నాడు. "రామన్నా, నీ తీర్పు అద్భుతం. నాకెంతగానో నచ్చింది. నిజంగా నువ్వు గొప్ప మేధావివి. నీ తీర్పులు కేవలం ఒక్క గ్రామానికే పరిమితం కాకూడదు. నువ్వు మా ఆస్థానంలో న్యాయాధిపతిగా వుండాలి. ఆస్థానానికి వచ్చే సమస్యలు, తగాదాలు అన్నీ నువ్వే పరిష్కరించాలి. నీ విలువయిన తీర్పులు మాకు కావాలి! నువ్వు మా అభ్యర్థనను అంగీకరించాలి".

రామన్న రాజుగారి అభ్యర్థనను కాదనలేకపోయాడు. ఆ తరువాత రామన్న కుటుంబం అంతఃపురానికి మారింది. రాజు రామన్నకు కావలసిన ఏర్పాట్లన్నీ చేశాడు.




# పోయిన వస్తువు

ఒక గ్రామంలో శేషయ్య అనే రైతు వున్నాడు. అతనికి రెండు ఎకరాల భూమి, ఒక ఇల్లు వున్నాయి. అతనికి పిల్లలు లేరు. అతని భార్య పిల్లల కోసం అనేక ప్రార్థనలు చేసింది. అనేక దేవాలయాలు సందర్శించింది. పవిత్ర నదులలో స్నానాలు చేసింది. శ్రీ వెంకటేశ్వరుణ్ని అనేక రకాలుగా పూజించింది. ఆవిడ చేసిన పూజలు ఫలించాయి. ఆమెకు ఒక కొడుకు పుట్టాడు. శేషయ్య తన కొడుక్కి వెంకయ్య అని పేరు పెట్టాడు. వెంకయ్య పెరిగి పెద్దవాడయ్యాడు. యుక్తవయస్సు వచ్చింది. వెంకయ్యకు పెళ్ళి చేసే వుద్దేశ్యంతో శేషయ్య ఆడపిల్లల్ని వెదకటం ప్రారంభించాడు. చివరికి బంధువులలోనే సంబంధం ఖాయమయింది.



పెళ్ళి నిశ్చయించారు. పెళ్ళి రోజున తన కొడుకును, కోడల్నీ గుర్రంపై వూరేగించాలని శేషయ్య భావించాడు. అందుకోసం ఆ వూళ్ళో వున్న ఇబ్రహీంఖాన్ అనే వ్యక్తి దగ్గర గుర్రం వుందని తెలుసుకుని అతన్ని కలిశాడు. ఇబ్రహీంఖాన్ వంద రూపాయలు అద్దె అడిగాడు. అందుకు అంగీకరించి అద్దె చెల్లించి గుర్రాన్ని తీసుకువచ్చాడు శేషయ్య. ఆ గుర్రాన్ని అందంగా అలంకరించి పెళ్ళి కుమారుడు, పెళ్ళి కుమార్తెను గుర్రం మీద వూరేగించారు. వీధుల్లో ప్రజలందరూ యువజంటను ఆశీర్వదించారు.

యువజంట ఇంటికి తిరిగి వస్తూ వుండగా, గుర్రం హఠాత్తుగా క్రిందపడి చచ్చిపోయింది. గుర్రం చచ్చిపోవటానికి కారణం ఎవ్వరికీ తెలియడం లేదు. గ్రామస్థులందరూ నివ్వెరపోయారు. శేషయ్య ఆందోళనకు గురయ్యాడు. ఏమి చేయాలో అతనికి పాలుపోలేదు. చివరికి ఇబ్రహీంఖాన్ దగ్గరకు వెళ్ళి జరిగిన సంఘటన వివరించాడు. “ఖాన్ ! ఈ పరిణామం నేను వూహించలేదు. నేనెవ్వరినీ తప్పు పట్టలేను. నీ గుర్రం విలువ ఎంతో చెప్పు. ఆ డబ్బు



నేను చెల్లిస్తాను'' అని అన్నాడు శేషయ్య. గుర్రం చచ్చిపోయిందనే విషయం అప్పటికే తెలుసుకున్న ఖాన్ శేషయ్య మాటలకు కోపోద్రిక్తుడయ్యాడు. “నీడబ్బు నాకెంత మాత్రమూ వద్దు. అసలు నా గుర్రానికి వెల కట్టటం ఎవ్వరివల్లా కాదు. అటువంటి గుర్రం ఎక్కడా దొరకదు. నా గుర్రం నాకు కావాలి,'' అని కేకలేశాడు. అందుకు శేషయ్య “ఖాన్ ! నిజమే, నీ గుర్రం గొప్పదే కావచ్చు. అయితే ఇప్పుడది చచ్చిపోయింది. నువ్వు కొంచెం ఆలోచించు, చచ్చిపోయిన గుర్రాన్ని ఎలా తీసుకురాగలను'' అన్నాడు.

“నువ్వు చెప్పేదేమీ నేను వినను. నా గుర్రం నాకు కావాలంతే'' అన్నాడు ఖాన్ ఆవేశంగా. అప్పటికే అక్కడకు చేరిన గ్రామస్థులు ఖాన్‌ను శాంతపర్చే ప్రయత్నం చేశారు. అయితే ఖాన్ మాత్రం వాళ్ళ మాటలు ఖాతరు చేయకుండా తన గుర్రం తనకు కావాలని పట్టుబట్టాడు.



చేసేది లేక శేషయ్య తన పరిస్థితిని మర్యాదరామన్నకు వివరించాడు. కొద్దిసేపు దీర్ఘంగా ఆలోచించిన తరువాత, "శేషయ్యా, ఈ విషయం నేను రేపు పరిష్కరిస్తాను. రేపు నేను ఖాన్ కోసం సైనికుడ్ని పంపుతాను. నిన్ను తీసుకుని ఆస్థానానికి రమ్మని సైనికుడు ఖాన్‌తో చెపుతాడు. అప్పుడు ఖాన్ నీ ఇంటికి వస్తాడు. ఖాన్ వచ్చే సమయానికి నువ్వొక పనిచెయ్యాలి. నీ ఇంటి ప్రధాన ద్వారం మూసి వుంచు. లోపల గొళ్ళెం మాత్రం వేయవద్దు. ఇరవై, ముప్పై మట్టి కుండలు ఆ తలుపుకి ఆనించి వుంచు. ఈ పనిని నువ్వు జాగ్రత్తగా ఎవరికీ తెలియకుండా చెయ్యాలి. అంతే, మిగతా విషయం నేను చూసుకుంటాను.

ఈ పనిని నువ్వు తెలివిగా నిర్వహించాలి మరచిపోవద్దు. అన్ని పనులూ ఉదయం ఎనిమిది గంటలకల్లా జరిగి పోవాలి" అని అన్నాడు మర్యాదరామన్న.

శేషయ్య ఇంటికి తిరిగివచ్చి రామన్న చెప్పినట్లుగానే అన్ని పనులూ పూర్తి చేశాడు. తలుపులు దగ్గరగా వేసి, వాటిని ఆనించి ముప్పై మట్టికుండలు పెట్టాడు. అనుకున్నట్టుగానే



సైనికుడు ఖాన్ దగ్గరకు వెళ్ళి విషయం చెప్పాడు. ఖాన్ శేషయ్యని తీసుకుపోయేందుకు అతని ఇంటికి వచ్చాడు. ఇంటి బయటనుంచి శేషయ్యను పిలిచాడు. ఎవరూ తలుపు తీయలేదు తలుపు నెట్టాడు. దాంతో తలుపుకు ఆనుకుని వున్న కుండలన్నీ ముక్కలు ముక్కలయ్యాయి. శేషయ్య బయటకు వచ్చి "కుండలు పగలగొట్టావు ! ఇవి నా బంగారు కుండలు. వీటిని నేను ఎంతో అపురూపంగా చూసుకుంటున్నాను". అని తీవ్ర స్వరంతో అరిచాడు.

ఖాన్ బిత్తరపోయి, "ప్రధాన ద్వారం వెనుక కుండలుంటాయని వూహించలేదు ! నేను మామూలుగా నిన్ను పిలవటం కోసం తలుపు నెట్టాను" అని అన్నాడు. అందుకు శేషయ్య "ఉదయాన్నే నువ్వు నా మట్టి కుండలు పగులగొట్టావు. ఈ రోజు ఇదొక అపశకునం. ఇప్పుడేం చేయాలి !" అని శేషయ్య తనని తాను తిట్టుకోవటం మొదలు పెట్టాడు. ఆ మాటలు విన్న ఖాన్, "నేను నీకు కొత్త కుండలు కొని ఇస్తాను. విచారించమాకు", అని



అన్నాడు. శేషయ్యకు అప్పుడు మర్యాదరామన్న తలుపు వెనుక కుండలు ఎందుకు వుంచమన్నాడో అర్థమయింది. "నాకు కొత్త కుండలు వద్దు. ఈ కుండల్ని మా ఇంట్లో అనేక తరాలుగా ఉపయోగిస్తున్నాము. అవి చాలా పవిత్రమయినవి. ఆ కుండలకు మా అదృష్టానికి సంబంధం వుంది. నాకు ఆ కుండలే కావాలి". అని వాదించాడు శేషయ్య.

"సరే ! ఆ విషయం తరువాత చూద్దాం. ముందు మనం రాజు గారి ఆస్థానానికి వెళ్ళాలి. పద, ఇప్పటికే ఆలస్యమయింది" అన్నాడు ఖాన్. ఆ తరువాత ఇద్దరూ కలిసి రాజు గారి ఆస్థానానికి వెళ్ళారు. ఆస్థానంలో ఖాన్, శేషయ్య ఇద్దరూ వారి, వారి వాదనల్ని వినిపించారు.

"అయ్యా ! మా సమస్యని విచారించబోయే ముందు, మీకు ఈరోజు ఉదయం జరిగిన సంఘటనొకటి చెప్పాలి", అన్నాడు శేషయ్య రామన్నతో. "ఏమిటో చెప్పు" అన్నాడు మర్యాదరామన్న. "ఈరోజు ఖాన్ నా ఇంట్లోని మట్టికుండలు పగలగొట్టాడు. అవి మాకు



కలసి వచ్చిన కుండలు. ఇప్పటి వరకు వాటివల్ల మా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది. ఫలితంగా నాకే అపాయం జరుగుతుందోనని భయంగా వుంది. దయచేసి ఈ విషయం పరిశీలించి మీరు నాకు న్యాయం చేయండి". అని వివరించాడు శేషయ్య.

ఇది విన్న ఇబ్రహీంఖాన్, "అయ్యా ! శేషయ్య పగులగొట్టిన కుండల్ని తిరిగి తెమ్మంటున్నాడు నేను పాతవాటికి బదులుగా కొత్తకుండలు ఇస్తానని చెపుతున్నా వినిపించుకోవటం లేదు. అవే కావాలంటున్నాడు. పగిలిన కుండల్ని యధాతథంగా నేనెలా ఇవ్వగలను. దయచేసి ఈ సమస్యను మీరే పరిష్కరించాలి" అని విన్నవించుకున్నాడు.

"సరే ! నువ్వు చెప్పింది బాగానే వుంది ఖాన్. నువ్వు చేసిందీ అదేగదా. చచ్చిన గుర్రాన్ని తిరిగి తెచ్చివ్వమని శేషయ్యను వేధించలేదా ! తను మాత్రం చచ్చిన గుర్రాన్ని ఎక్కడ నుంచి తేగలడు. నీకు నీ గుర్రం ఎంత విలువయిందో, అతనికి ఆ కుండలూ అంతే విలువయినవి. అయితే వాటిని తిరిగి తెమ్మనటం కూడ సరికాదు. ఈ విషయం



గుర్తించి ఇద్దరు మంచిగా వుండండి. నువ్వు నీ గుర్రాన్ని, అతను తన కుండల్ని మర్చిపోయి, స్నేహంగా వుండండి. తప్పులు, పొరపాట్లు ఎవరయినా చేస్తారు, ఎవరి విషయంలోనయినా జరుగుతాయి''. అని మందలించాడు రామన్న. రామన్న తీర్పు విన్న ప్రజలందరూ నవ్వుకోకుండా వుండలేకపోయారు. ఖాన్ తన వాదనలోని తప్పేమిటో తెలుసుకున్నాడు. తన తప్పు గ్రహించి తల వంచుకున్నాడు. శేషయ్య రామన్నకు ధన్యవాదాలు తెలుపుకున్నాడు.



# బంగారు చెవి పోగుల కథ

పూర్వ కాలంలో మనుష్యుల మనస్తత్వాలు కూడా మంచిగా వుండేవి. మనుష్యుల మధ్య ప్రేమానురాగాలు ఎక్కువగా వుండేవి. అటువంటి కాలంలో ఒకరోజు ఇద్దరు బాటసారులు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తూ చీకటిపడటం వల్ల ప్రయాణాన్ని ఆపి ఒక చిన్న సత్రం దగ్గర ఆగి అక్కడ భోజనాలు చేసి అక్కడే నిద్రకుపక్రమించారు. వాళ్ళిద్దరూ స్నేహితులు కాదు. ఇద్దరూ వేరు వేరు గ్రామాలకు చెందినవారు. మార్గం మధ్యలో కలుసుకున్నారు. ఒకని పేరు శాంతయ్య, రెండవ వ్యక్తి పేరు కాంతయ్య. శాంతయ్య చెవులకు పోగులున్నాయి. అవి బంగారు పోగులు. ఆ పోగులు ఎంతో ఆకర్షణీయంగా వున్నాయి.



కాంతయ్యకళ్ళు శాంతయ్య చెవి పోగుల మీద పడ్డాయి. వాటిని ఎలాగయినా తస్కరించాలని నిర్ణయించుకున్నాడు. ఆ లక్ష్యంతోనే శాంతయ్యతో స్నేహం నటిస్తూ, అతనిని అనుసరిస్తూ వచ్చాడు. శాంతయ్య అమాయకుడు. ఇద్దరి మధ్య సంభాషణలో కాంతయ్య అడిగిన ప్రశ్నలన్నింటికీ ఎంతో సహనంగా సమాధానాలు చెప్పాడు శాంతయ్య. కాంతయ్య మాత్రం పోగుల గురించే ఆలోచిస్తూ వున్నాడు. ఆ తరువాత శాంతయ్య నిద్రలోకి జారుకున్నాడు. కాంతయ్య నిద్ర నటిస్తూ వున్నాడు. బంగారు పోగులు అతని కళ్ళలో మెదులుతూ వుండటం వల్ల నిద్రపోలేకపోయాడు. అదే సందర్భంలో కాంతయ్య కొక మెరుపులాంటి ఉపాయం తట్టింది. దాన్ని అమలుపర్చే సమయం కోసం నిరీక్షిస్తున్నాడు. అర్థరాత్రి తరువాత అందరూ దీర్ఘ నిద్రలో వున్నారు. కొంతమంది గురకలు పెడుతున్నారు. కాంతయ్య కూడా అప్పటికి మగత నిద్రలోకి జారుకుని మళ్ళీ మేలుకున్నాడు. ఆ తరువాత మెల్లగా శాంతయ్య దగ్గరకు వెళ్ళి ఒక చెవి పోగు తస్కరించాడు. రెండవ పోగు కూడా తీయటానికి ప్రయత్నించాడు.



శాంతయ్య అవతలవైపుకు తిరగలేదు. పోగు తీయటం సాధ్యపడలేదు. కాంతయ్య కొంతసేపు అక్కడే వుండి శాంతయ్య ఇవతలివైపుకు తిరుగుతాడేమోనని చూశాడు. శాంతయ్య కదలలేదు. 'దొరికిన దానితో తృప్తి పడటం మంచిది', అనుకున్నాడు కాంతయ్య. వెంటనే ఆ పోగును తన చెవికి పెట్టుకుని ఏమీ తెలియనట్లే నిద్రపోయాడు కాంతయ్య.

తెల్లవారిన తరువాత ప్రయాణీకులందరూ నిద్ర లేచారు. అందరూ తమ తమ సామాన్లు సర్దుకుంటూ వున్నారు. ఆ సమయంలో శాంతయ్య తన చెవిపోగు పోయిందని గ్రహించాడు. ఆత్రుతగా ఆ ప్రాంతమంతా కలయజూశాడు. ఎక్కడా పోగు కనిపించలేదు. ఆ పోగు కాంతయ్య చెవికి అలంకరింపబడి వుంది. అది తన చెవిపోగే అని గుర్తించాడు. "నా చెవి పోగు నీ దగ్గరకు ఎలా వచ్చింది. బహుశా నేను నిద్రలో వున్నప్పుడు నువ్వు దానిని దొంగిలించివుంటావు, నా పోగు నాకు ఇవ్వు," అని కాంతయ్యని అడిగాడు శాంతయ్య." నోర్మూయ్, హద్దుమీరి మాట్లాడకు. అసలు నేనే నిన్ను అడగాలనుకుంటున్నాను" అసలు నీ చెవికి వున్న పోగు ఎక్కడిది? అది అచ్చం నా చెవిపోగులానే వుంది. అది కనిపించకపోవటం




వల్లనే నేను వెతకులాడుతూ వున్నాను. నా చెవిపోగు దొంగిలించింది చాలక నన్నే దొంగగా జమకడుతున్నావు. మర్యాదగా నా చెవిపోగు నాకు తిరిగి ఇవ్వు'' అని గర్జించాడు కాంతయ్య. ఆ విధంగా ఇద్దరి మధ్య కొంతసేపు సంవాదం నడిచింది.

శాంతయ్య, కాంతయ్యల మధ్య జరుగుతున్న గొడవ చూసి కొద్దిసేపటిలోనే అక్కడ జనం పోగయ్యారు. అయితే ఇద్దరికీ చెవిపోగులు వుండటం వల్ల, ఎవరి వాదన సరైనదో తెలియక పోవటం వలన ఎవరూ నోరు మెదపలేదు. కేవలం చూస్తూ వుండి పోయారు. పైగా రెండు చెవిపోగులు ఒకే రకంగా వుండటం వాళ్ళ మౌనానికి మరొక కారణం. సాక్షులు ఎవ్వరూ లేరు. అందువల్ల అసలు దొంగ ఎవరో అర్థం కావటం లేదు. గుమిగూడిన జనంలో ఒకడు రాజుగారికి ఫిర్యాదు చేయటం మంచిదని సూచించాడు. రాజుగారి ఆస్థానానికి ఇద్దరూ వెళ్ళి ఫిర్యాదు చేశారు.




సమస్య రామన్న దగ్గరకు వచ్చింది. రామన్న కాంతయ్య, శాంతయ్య చెప్పిన విషయాలు అన్నీ ప్రశాంతంగా విన్నాడు. సాక్షులెవ్వరూ లేకపోవడం వలన సమస్య జటిలంగా మారింది. చివరికి రామన్న కాంతయ్య, శాంతయ్యలను తమ చెవిపోగులు తీసి తనకివ్వమన్నాడు. వాళ్ళు అలాగే చేశారు. రామన్న రెండు పోగుల్ని తన చేతుల్లో వుంచి రెండూ సమానమైన బరువుతో వుండటం గమనించాడు. దాంతో తప్పకుండా రెండు పోగులు ఒకే వ్యక్తికి చెంది వుంటాయనే విషయంలో రామన్న నిర్ధారణకు వచ్చాడు. వెంటనే పోగులు వాళ్ళిద్దరికీ ఇచ్చి అంతకు ముందు ధరించినట్లుగానే ధరించమని రామన్న శాంతయ్య, కాంతయ్యలకు చెప్పాడు. వాళ్ళు ఆ పోగుల్ని ధరిస్తూ వుండగా రామన్న వాళ్ళను సునిశితంగా పరిశీలించాడు. ఆ తరువాత, "గత రాత్రి మీరు ఎక్కడ పడుకున్నారు ?'' అని కాంతయ్య, శాంతయ్యలను అడిగాడు. "మేము ఒక సత్రంలో నిద్రించాము'' ఇద్దరూ ఒకేసారి చెప్పారు. "మీరు ఎటువైపుకు తిరిగి పడుకున్నారు'' అని మళ్ళీ రామన్న వాళ్ళిద్దరినీ అడిగాడు.



రామన్న అడిగిన పశ్న వెనుక వున్న ఆంతర్యం వాళ్ళిద్దరికీ అర్థం కాలేదు. అందువల్ల వాళ్ళు ఎటు తిరిగి పడుకుంది స్పష్టంగానే చెప్పారు. వాళ్ళు చెప్పిన సమాధానాన్ని బట్టి వారిద్దరిలో ఒకరు రెండవ వ్యక్తి చెవిపోగు దొంగిలించాడనే విషయంలో ఒక నిర్ధారణకు వచ్చాడు రామన్న. ఆ తరువాత కాంతయ్య వైపు తిరిగి, "శాంతయ్య నీ చెవి పోగు దొంగిలించాడన్నావు కదా ! ఏ చెవి పోగో చెప్పగలవా ?" అని అడిగాడు రామన్న.

రామన్న ప్రశ్నకు కంగుతిన్న కాంతయ్య "ఎడమ చెవిపోగు" అని బదులిచ్చాడు.


వెంటనే రామన్న, "మూర్ఖుడా, నీ ఎడమ చెవి నీ తల కింద వుంది. అటువంటప్పుడు నీ ఎడమ చెవి పోగు దొంగిలించటం ఎలా సాధ్యం ? నీకు తెలియకుండా నీ పోగు తియ్యటం ఎలా వీలవుతుంది.!" అని రామన్న కాంతయ్యను గద్దించాడు. కాంతయ్యకు నోటి వెంట మాట రాలేదు.



అప్పుడు రామన్న, "నువ్వొక మోసగాడివి. ఇంకా అబద్ధం చెప్పకు. నువ్వు పోగు దొంగిలించి పారిపోవాలని ప్రయత్నించావు. నువ్వే నేరస్తుడివి. నిజాయితీగా నీ తప్పు వొప్పుకుని శాంతయ్యకు పోగు ఇచ్చి క్షమాభిక్ష అడుగు. ఇక నువ్వు తప్పించుకోవటం అసాధ్యం. నేను నిన్ను జైలులో పెట్టిస్తాను" అని కేకలు వేశాడు రామన్న.

కాంతయ్య గందరగోళపడిపోయి తన తప్పు వొప్పుకుని, క్షమించమని ప్రార్థించాడు. తన పోగు తనకు తిరిగి దక్కటమే కాకుండా, తాను దొంగను కానని రుజువయినందుకు శాంతయ్య అమితంగా ఆనందించాడు. రామన్నకు తన కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

ఆ తరువాత రామన్న తన తీర్పు చదివాడు, "కాంతయ్య శాంతయ్య చెవిపోగు దొంగిలించాడు. అతను కావాలనే ఆ పని చేశాడు. అయితే చివరకు తన తప్పును అంగీకరించాడు. ఆ విషయాన్ని దృష్టిలో వుంచుకుని కాంతయ్యకు ఆరు నెలలు సాధారణ శిక్ష విధిస్తున్నాను", అని ప్రకటించాడు రామన్న.



రామన్న తీర్పు విని రాజు కూడా ఆనందించాడు. ఆ ఆనందంతో అతన్ని హృదయానికి హత్తుకున్నాడు. "రామన్నా! నేను నీకు ఎంతో కృతజ్ఞుణ్ని . నా దగ్గర ఈ సంక్లిష్ట సమస్యకు పరిష్కారం లేదు. కొద్దిసేపట్లోనే నువ్వు సమస్యను సునాయాసంగా పరిష్కరించావు. ఈ ఆస్థానంలో న్యాయమూర్తి స్థానంలో వుండదగిన వ్యక్తివి నువ్వు" అని ప్రకటించి రాజు బంగారు కానుకలు ఇచ్చాడు రామన్నకు.



# వజ్రం కోసం తగాదా

చిత్రపురం అనే వూరిలో రామశర్మ అనే పేద వ్యక్తి వున్నాడు. విలువయిన ఒక వజ్రం తప్ప అతని దగ్గర మరే ఇతర ఆస్తి లేదు. ఆ వజ్రం అతనికి తన పూర్వీకుల నుండి సంక్రమించింది.

ముసలితనంలోవున్న రామశర్మ తీర్థయాత్రలు చేయాలని నిర్ణయించుకున్నాడు. మొదటగా కాశీయాత్ర చేయాలకున్నాడు. తాను ఇల్లు వదలి వెళుతున్నందువల్ల విలువయిన వజ్రాన్ని ఇంట్లో వుంచటం కానీ, తనతో తీసుకెళ్ళటం కానీ మంచిది కాదని నిర్ణయించుకున్నాడు. ఆ వజ్రాన్ని తన స్నేహితుడు, పొరుగువాడు అయిన శ్రీనివాసులు దగ్గర వుంచాలని నిర్ణయించు కున్నాడు. అనుకున్నట్టుగానే ఆ వజ్రాన్ని శ్రీనివాసులుకు ఇచ్చి తను తిరిగి వచ్చేంతవరకు జాగ్రత్తగా వుంచమని కోరాడు. ఆ వజ్రాన్ని భద్రంగా



వుంచగలనని హామీ ఇచ్చాడు శ్రీనివాసులు. అతని మాటలకు అమితంగా సంతోషించిన రామశర్మ నిశ్చింతగా కాశీకి బయలుదేరి వెళ్ళాడు. కాశీతోపాటు అనేక ప్రాంతాలు సందర్శించి రామశర్మ తన స్వస్థలం తిరిగి వచ్చాడు. ప్రయాణంలో బాగా అలసిపోయి వుండటం వలన రెండు రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకుని, మూడవ రోజు శ్రీనివాసులు ఇంటికి వెళ్ళాడు.

తన వజ్రాన్ని ఇమ్మని అడిగాడు రామశర్మ. అందుకు శ్రీనివాసులు "వజ్రం ఏమిటి? నీకు తిరిగి ఇచ్చేశాను కదా !" అని అన్నాడు. రామశర్మ బిత్తరపోయాడు. తేరుకుని వజ్రం విషయం శ్రీనివాసులుకు గుర్తుచేసే ప్రయత్నం చేశాడు రామశర్మ. అందువల్ల వుపయోగం కన్పించలేదు. "రెండు రోజుల క్రితం నువ్వు నా దగ్గరకు వచ్చి వజ్రాన్ని తీసుకుని వెళ్ళి, ఇప్పుడు మళ్ళీ వజ్రం ఇమ్మని అడుగుతావేంటి ?" అని రెట్టించాడు శ్రీనివాసులు. శ్రీనివాసులు చెపుతున్న అబద్ధాన్ని రామశర్మ జీర్ణించుకోలేకపోయాడు. "ఇంతకు ముందు నీ దగ్గరకు ఎప్పుడు వచ్చాను. వూరి నుంచి వచ్చిన తరువాత ఇదే మొదటిసారి నీ దగ్గరకు



రావటం. అటువంటప్పుడు నువ్వు నాకు వజ్రాన్ని ఇవ్వటం ఎలా సాధ్యం. దయచేసి అబద్ధం చెప్పకు. నా వజ్రం నాకు తిరిగి ఇవ్వు'' అని వేడుకున్నాడు.

దాంతో మరింత కోపగించుకున్నాడు శ్రీనివాసులు. "నాకు ముందే తెలుసు నువ్వు ఇలా అడ్డం తిరిగి మాట్లాడతావని. అందుకే ఆ వజ్రాన్ని నీకు ముగ్గురి సమక్షంలో ఇచ్చాను. ఓ మంగలి, మరొక చాకలి, ఇంకొక తాపీమేస్త్రి సమక్షంలో ఇచ్చాను''అన్నాడు. ఇద్దరి మధ్య కొద్దిసేపు ఘర్షణ జరిగింది. ఇక విషయం తేలదని ఇద్దరూ రామన్న దగ్గరకు వెళ్లారు. ఇద్దరి కథనాలు విన్న తరువాత రామన్న సాక్షులను పిలిచాడు. ముగ్గురు సాక్షులను మూడు గదుల్లో వుంచి, మొదటగా మంగలిని ప్రశ్నించాడు. "శ్రీనివాసులు రామశర్మకు వజ్రం ఇవ్వటం నువ్వు చూశావా?'' అని అడిగాడు. మంగలి ఏమాత్రం తొట్రుపాటు పడకుండా చూశానని చెప్పాడు. "అయితే నువ్వు చూసిన వజ్రం పరిమాణంలో వుండే రాయి ఒకటి తీసుకురా'' అని అడిగాడు రామన్న. అలాగే మిగతా ఇద్దరికి కూడా చెప్పాడు. వాళ్ళు ముగ్గురూ రామన్న చెప్పినట్లుగానే చేశారు.



ఆ మరుక్షణము రామన్న తను తీర్పు చెప్పబోతున్నట్లు ప్రకటించాడు. దాంతో అందరిలో ఆసక్తి పెరిగింది. చాలా మంది ఆతృతతో అక్కడ గుమిగూడారు. రామన్న కొంతసేపు ఆలోచించి శ్రీనివాసులు నేరస్తుడు అని ప్రకటించాడు. "అతనికి మూడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, తప్పుడు సాక్ష్యం చెప్పిన ముగ్గురికి ఒక్కొక్క సంవత్సరం పాటు కఠిన కారాగార శిక్ష విధిస్తున్నాను" అని ప్రకటించాడు. "తప్పుడు సాక్ష్యం చెప్పిన వాళ్ళు కూడా నేరంలో భాగమే" అని నిర్థారించాడు రామన్న.

రామన్న తీర్పుకు ఆధారం ఏమిటో అక్కడ గుమిగూడిన ప్రజలకు అర్థం కాలేదు. అదే విషయాన్ని వివరించమని అందరూ రామన్నను అడిగారు. రామన్న నవ్వుతూ "ముగ్గురు సాక్షులనూ విడి విడిగా కలిసి వారిని తాము చూచిన వజ్రంతో సమానమైన రాళ్ళను తీసుకురమ్మన్నాను."

ముగ్గురూ మూడు వేరువేరు పరిమాణాలు వున్న రాళ్ళను తెచ్చారు. దాంతో వాళ్ళెవ్వరూ అసలా వజ్రాన్ని చూడలేదనే విషయం నాకు స్పష్టమయింది. ఆ ముగ్గురూ దొంగ సాక్ష్యం చెపుతున్నారని నిర్ధారణకు వచ్చి తీర్పు చెప్పాను" అని వివరించాడు. అందరూ రామన్న తెలివి తేటలకు మరొకసారి సంతోషించారు. ★








9 789384 812102

# స్వాతి బుక్ హౌస్

28-22-20, రహిమాన్ వీధి, అరండల్ పేట, విజయవాడ-2 (ఆం.ప్ర.)